వరిని వదలని మొగ్గి

- మందులు స్ప్రే చేసినా తగ్గని ఉధృతి
- నాగిరెడ్డిపేట మండలంలో పంట దిగుబడిపై ఆందోళనలో రైతులు


మొగిపురుగు నివారణకు వాడిన మందులను ఏవో సాయికిరణ్‌కు చూపుతున్న రైతులు


మొగిపురుగు ఆశించిన వరిపంట

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలో యాసంగిలో సాగు చేస్తున్న వరిపంటకు దాదాపు మొగిపురుగు ఆశించింది. ఈసీజన్‌లో 16,800ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేస్తున్నారు. దానిలో 5,386ఎకరాలు పోచారం ఆయకట్టు కింద, మిగతా బోర్ల కింద సాగు చేస్తున్నారు. దీంతో వరి పంటలో మొగిపురుగు నివారణ కోసం రైతులు వేల రూపాయలు వెచ్చించి పంటపై పలురకాల పురుగుమందులను స్ప్రే చేశారు. పంటలో పురుగు తీవ్రత తగ్గకపోవడంతో పంటలో వచ్చే దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల మొగిపురుగు నివారణ కోసం కొందరు రైతులు సకాలంలో సరైన పద్ధతిలో నాణ్యమైన మందులను వినియోగించడంతో పంటలో కొంతమేర మొగి తీవ్రత తగ్గింది.

పని చేయని మందులు..

ఇతర ప్రాంతాల్లోని మందుల ధరలతో పోలిస్తే స్థానికంగా మందులు ధరలు అధికంగా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి తెచ్చుకున్న మందులను స్ప్రే చేసిన రైతుల పంటలలో మొగిపురుగు నివారించబడిందని చెబుతున్నారు.ఈవిషయమై మండలంలోని నాగిరెడ్డిపేట, బంజార గ్రామాలకు చెందిన కొందరు రైతులు శనివారం నాగిరెడ్డిపేట వ్యవసాయ కార్యాలయంలో ఏవో సాయికిరణ్‌ను కలిసి వారి ఆవేదనను వెళ్లగక్కారు. నాసిరకం మందులను అంటగట్టి తమను ఆర్థికంగా నష్టపర్చిన దుకాణాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మందుల కోసం వేలు ఖర్చు చేశా



గ్రామశివారులోని సుమారు నాలుగున్నర ఎకరాల్లో భూమిని కౌలుకు తీసుకొని వరి వేశాను. పంటలో మొగి నివారణ కోసం గోపాల్‌పేటలో సుమారు రూ.18వేలు ఖర్చు చేసి మందులు స్ప్రే చేశాను. పురుగు ఏ మాత్రం తగ్గకపోగా మరింత ఎక్కువైంది. ఇతర రైతులు ఇతర జిల్లాల నుంచి మందులను కొనుగోలు చేసి పంటపై స్ప్రే చేయడంతో మొగిపురుగు తగ్గింది.

– కుర్మ నాగయ్య, రైతు, నాగిరెడ్డిపేట

మందులు పని చేయలేవు



నేను ఎకరంన్నర భూమిని కౌలుకు తీసుకొని వరిపంట వేశాను. పంటను ప్రస్తుతం మొగిపురుగు ఆశించింది. పంటలో మొగిపురుగు నివారణ కోసం ఇప్పటివరకు రెండుసార్లు మందులు స్ప్రే చేశాను. ఇందుకోసం సుమారు రూ.6వేల వరకు ఖర్చయింది. పంటలో పురుగు తీవ్రత తగ్గలేదు.

– గుండెబోయిన నర్సింలు, రైతు, నాగిరెడ్డిపేట

పంటలో మొగి తీవ్రత ఎక్కువగా ఉంది

ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న వరి పంటలో మొగితీవ్రత ఎక్కువగా ఉంది. పంటలో మొగిపురుగును సకాలంలో గుర్తించి సరైన పద్ధతిలో చర్యలు చేపడితే మొగిని నివారించవచ్చు. మొగిపురుగు నివారణ కోసం స్ప్రే చేసిన మందులు పనిచేయడంలేదని కొందరు రైతులు నా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తగినచర్యలు చేపడతాం.

– సాయికిరణ్, ఏవో, నాగిరెడ్డిపేట

నీటిని వృథా చేయకూడదు


చీనూర్‌లో మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాగునీటిని వృథా చేయకూడదని, ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని చీనూర గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కంపోస్ట్‌షెడ్డు, నర్సరీ, వైకుంఠధామం, కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. దీంతోపాటు గ్రామ పంచాయతీ కార్యాయంలోని పలురికార్డులను ఆయన తనిఖీ చేశారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని నీటి ప్రాముఖ్యతను గ్రామస్తులకు ఆయన వివరించారు. పంచాయతీ కార్యదర్శి సరేందర్ ఉన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని అడివిలింగాల గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకున్నట్లు ఎంపీవో ప్రకాష్ శనివారం తెలిపారు. గ్రామంలో వేసవి దృష్ట్యా నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు గాను బోరు మోటారు ఏర్పాటు చేశామన్నారు. పంచాయతి కార్యదర్శి శంకరయ్య తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం దోస్త్‌పల్లి గ్రామంలో శుక్రవారం బోరుమోటార్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలోని బోరుమోటార్లు చెడిపోవడంతో నీటి ఎద్దడి నెలకొందని చెప్పారు. ఆయన వెంట గ్రామ పెద్దలు ఉన్నారు.



ఇస్రోజీవాడిలో పనులను ప్రారంభిస్తున్న నాయకులు, కాస్లాబాద్ గ్రామంలో..

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కామారెడ్డి రూరల్/పెద్దకొడప్‌గల్/బాన్సువాడ రూరల్ : కామారెడ్డి మండలం ఇస్రోజీవాడిలో ఉపాధిహామీ కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను శనివారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. పెద్దకొడప్‌గల్ మండలం కాస్లాబాద్ గ్రామంలో పలుకాలనీల్లో సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి ప్రారంభించారు. బాన్సువాడ మండలం నాగారంలో ఉపాధి హామీ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బాన్సువాడ డీఎల్‌పీవో సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించారు. వాటర్ క్యూరింగ్ తప్పకుండా చేయించాలని వారు సూచించారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శులు నవీన్ గౌడ్, సృజన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విపుల్ జైన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు నంది వేణు, కాంగ్రెస్ నాయకులు శామప్పపటేల్, పండరి, తదితరులున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాలు ప్రారంభం


ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలను ప్రారంభిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోవాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య అన్నారు. శనివారం కళాశాల ఒకటో, రెండో, మూడో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో వేసవి ప్రత్యేక శిబిరాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, శారద, సమన్వయకర్తలు విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, ఎన్‌సీసీ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో వ్యవసాయ విద్యార్థులు చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్(జాతీయ సేవా పథకం)లో భాగంగా శనివారం రైతులకు మట్టిసేకరణ, భూసార పరీక్షల నిర్వాహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మట్టినమూనాలను సేకరించి భూసార పరీక్షలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉన్నతవిద్య ప్రాముఖ్యతను వ్యవసాయ విద్యార్థులు వివరించారు. ప్లాస్టిక్ నివారణ గురించి, నీటి ప్రాముఖ్యతను డీఎల్‌పీవో సురేందర్ వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జీపీ కార్యదర్శి తిరుపతి, ఏరువాకకేంద్రం కో–ఆర్డినేటర్లు అనిల్‌రెడ్డి, రేవంత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర శివానీ, డాక్టర్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సోమారంలో కొనసాగుతున్న ప్రోగ్రాం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సోమారంలో శనివారం కామారెడ్డిలోని ఎస్‌ఆర్‌కే డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థులు గ్రామంలోని ప్రధాన వీధులు, పాఠశాలలు, దేవాలయాలు శుభ్రం చేశారు. పల్లెప్రకృతివనంలోని చెత్తచెదారం, పిచ్చిమొక్కలను తొలగించారు. కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ దత్తాద్రి, ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, తిరుపతిరెడ్డి, బాలురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్ తైబజార్ @ రూ.17.50 లక్షలు


మద్నూర్‌లో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో శనివారం తై బజార్ వేలం పాట నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గాను నిర్వహించిన వేలం పాటలో మద్నూర్‌కు చెందిన అవార్‌వార్ హన్మండ్లు రూ.17,50,500 లక్షలకు దక్కించుకున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. ప్రత్యేక అధికారి రాణి, పంచాయతీ కార్యదర్శి సందీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంజపల్లిలో వాయిదా పడ్డ తైబజార్ వేలం..

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో శనివారం తహసీల్దార్ బిక్షపతి ఆధ్వర్యంలో తైబజార్ వేలం పాట నిర్వహించారు. గతేడాది తైబజార్ రూ.2.24 లక్షలు పలుకగా ఈసారి తక్కువ ధర రావడంతో వేలం పాటను వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి భీంరావు తెలిపారు. ఈ నెల 25న తిరిగి తైబజార్ వేలం పాట నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

వాయిదా పడ్డ గొర్రెలు, మేకల క్రయవిక్రయాల వేలం

పిట్లం(జుక్కల్): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో కమలాకర్ అధ్యక్షతన గొర్రెల, మేకల క్రయవిక్రయాలకు సంబంధించి వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో 9 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. హోరాహోరీగా సాగిన వేలం చివరకు రూ.6.12 లక్షలకు ఆగింది. దీంతో నిర్ణయించిన ధర రాక పోవడంతో వేలంను వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి బల్‌రాం తెలిపారు.

25న రాజంపేట తైబజార్ వేలం

రాజంపేట: రాజంపేట మండల కేంద్రంలో డీఎల్‌పీవో ఆదేశాల మేరకు ఈ నెల 25న ఎంపీడీవో రఘురాం అధ్యక్షతన తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వేలం పాటదారులు ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

సంక్షిప్తం

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మాచారెడ్డి: మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఈరంరాకేశ్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఎంఈవో దేవేందర్‌రావ్, ఉపాధ్యాయులు స్వప్న, పుష్ప, సీఆర్‌పీ నరేశ్ ఉన్నారు.

పారిశుధ్య పనులు వేగవంతం చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం పారిశుధ్య పనులు నిర్వహించినట్లు ఎంపీవో మల్హారి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రతి వార్డులో మురుగు కాల్వలు, వీధుల్లోని రోడ్లకు ఇరువైపులా మొలకెత్తిన పిచ్చి మొక్కలను తొలగించినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో తాగునీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సాయిలు, నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

మోడల్ ఎంసెట్ పరీక్ష కరపత్రాల ఆవిష్కరణ

కామారెడ్డి టౌన్: టీఎస్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షకు సంబంధించిన కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే కళాశాలలో ఆవిష్కరించారు. ఈనెల 23వ తేతదిన జిల్లా కేంద్రంలోని వీఆర్‌కే జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకుడు శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ శకుంతల మృతి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల శకుంతల (65) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. శకుంతల మృతికి పలువురు సంతాపం తెలిపారు. దేవునిపల్లి శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

వీఆర్వో, వీఆర్‌ఏల నియామకంపై హర్షం

కామారెడ్డి అర్బన్: గ్రామ పరిపాలనను బలోపేతం చేయడానికి రెవెన్యూ శాఖలో 10,954 మంది వీఆర్వో, వీఆర్‌ఏలను తిరిగి నియమించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడం హర్షనీయని గ్రామ పరిపాలన అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుబాసి మాణిక్యం ప్రకటనలో అన్నారు. ఈనిర్ణయంతో ఎంతోమంది ఉద్యోగులకు మంచి జరుగుతుందన్నారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయానికి మైక్‌సెట్, సౌండ్‌సిస్టం విరాళంగా ఇచ్చిన ఉపాధ్యాయుడు రాజాగౌడ్‌ను ఆలయల కమిటీ సభ్యులు సన్మానించారు.

రెండు రోజుల పాటు వీరభద్ర స్వామి ఉత్సవాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని మీసాన్‌పల్లి గ్రామంలో గల వీరభద్ర స్వామి ఆలయ ఉత్సవాలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి శేఖర్ శనివారం తెలిపారు. గ్రామంలో గల వీరభద్ర స్వామి వారి ఆలయ 23వ వార్షిక ఉత్సవాలు ఈనెల 24, 25వ తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆధ్యాత్మికం..

ఆంజనేయ ఆలయ కమిటీ చైర్మన్‌గా బంజ బస్వయ్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శ్రీ పాతూరి ఆంజనేయ స్వామి ఆలయ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బంజ బస్వయ్య, ప్రధానకార్యదర్శిగా ఉప్పల సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా తాడ్వాయి రవి, ఉపాధ్యక్షుడిగా అడ్డగుల్ల ఆంజనేయులు, అడ్వైజర్‌గా చెలిమెల యాదగిరిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, రాఘవ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమాత ఆశ్రమానికి విరాళం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని శబరిమాత ఆశ్రమానికి శనివారం ఆదిలాబాద్ జిల్లా పతాన్‌బోరి గ్రామానికి చెందిన సురేశ్‌రెడ్డి క్వింటాల్ కందిపప్పు , రూ.51వేల నగదును విరాళంగా అందజేశారు. ఆశ్రమంలో ఏప్రిల్‌లో జరిగే శ్రీరామ నవమి సందర్భంగా 25వార్షిక ఉత్సవాల కోసం ఇచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సొసైటీల పాలకవర్గం పదవీకాలం పెంపుపై హర్షం

లింగంపేట(ఎల్లారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గం పదవీకాలాన్ని ఆరు నెలలు పొడిగించింది. ఈవిషయమై లింగంపేట సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



బాన్సువాడ : ప్రభుత్వ గుర్తింపు పొందని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రచారాలు కొనసాగిస్తున్న కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ, టీఎస్‌ఎస్‌ఎఫ్, బీసీవీఎస్ విద్యార్థి సంఘాల నాయకులు రవీందర్‌గౌడ్, పుట్ట భాస్కర్, దత్తు ఉన్నారు.

సౌరశక్తి ఉత్పత్తిపై రైతులకు అవగాహన

కామారెడ్డి అర్బన్: పీఎం కుసుమ్ పథకం కింద సౌరశక్తి విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా లాభపడొచ్చని లీడ్ బ్యాంకు మేనేజర్ రవికాంత్, రెడ్‌కో అధికారి జగదీప్ రామ్, అరుణ్‌లు అన్నారు. శనివారం స్థానిక కళాభారతిలో సౌరశక్తి విద్యుత్ ఉత్పత్తికి ఆసక్తి కనబర్చిన 40 మంది రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్, డీఈ (టెక్నికల్) ప్రభాకర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డి: పట్టణంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

కామారెడ్డి సర్కిల్ పరిధిలో..

కామారెడ్డి టౌన్: కామారెడ్డి సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ చిన్న మల్లారెడ్డి ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 11: 00 నుంచి మధ్యాహ్నం 1: 00 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రవణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసన్నపల్లి, చిన్న మల్లారెడ్డి, రాజంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలు, కామారెడ్డిలోని పాత సాయిబాబా ఆలయం నుంచి శివాలయం ప్రాంతం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేటి ఎన్నికలను విజయవంతం చేయాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వేములవాడలో ఆదివారం నిర్వహించే మాల జంగం మహేశ్వరుల సంక్షేమ సంఘం రాష్ట్రస్థాయి ఎన్నికలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొదాది గంగాధర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలో సభ్యత్వం గల మాల జంగం మహేశ్వరులు విధిగా హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

నేడు వాసవి సహకార సంఘం మహాజన సభ

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి వాసవీకాలనీ ది వాసవి సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మహాజన సభ ఆదివారం సాయంత్రం 4గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శనిశెట్టి రాజామౌళి, ఎం.అనిల్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులందరు సకాలంలో హాజరు కావాలని కోరారు.

నేడు ఇఫ్తార్ విందు

బిచ్కుంద(జుక్కల్): ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదివారం బిచ్కుంద మిషన్ కల్లాలి రోడ్డులో గల క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, మైనారిటీ నాయకులు హాఫిజ్ గౌస్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హజరవుతున్నారని, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్, డోంగ్లీ మండలాలకు చెందిన ముస్లింలు ఇఫ్తార్ విందులో పాల్గొనాలని కోరారు.

రేపు బాన్సువాడకు ఎమ్మెల్సీ కవిత రాక

బాన్సువాడ : ఈ నెల 24న బాన్సువాడకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు జుబేర్ తెలిపారు. పట్టణంలోని పెద్ద మజీద్ వద్ద నియోజకవర్గానికి చెందిన మైనారిటీలకు సోమవారం సాయంత్రం 6 గంటలకు ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ నాయకుల హర్షం



బీబీపేట: ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు శాసనసభ ఆమోదం తెలపడంతో మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల అధ్యక్షుడు సుతారి రమేష్ ఆధ్వర్యంలో ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు భూమాగౌడ్, సలీం, మహేష్, స్వామి, రాకేష్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహర యాత్రలో విద్యార్థులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విజ్ఞాన విహార యాత్రకు తరలివెళ్లారు. ఒక రోజు క్షేత్ర పర్యటనలో బాగంగా బాసర సరస్వతీ దేవాలయం , నెమిలి సాయిబాబా ఆలయం, తెలంగాణ తిరుమల దేవస్థానం, సారంగపూర్ హనుమాన్ టెంపుల్, డిచ్‌పల్లి రామాలయం సందర్శించినట్లు ప్రధానోపాధ్యాయుడు దామోదర్ తెలిపారు.

క్లుప్తంగా

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



తాడ్వాయి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో శనివారం అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

నీటిని పొదుపు చేయాలని విద్యార్థుల ప్రదర్శన



కామారెడ్డి టౌన్: ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థులు నీటిని పొదుపు చేయాలని శనివారం వినూత్నంగా ప్రదర్శన చేశారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ , ఎన్‌ఎస్‌ఎస్‌ల ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని మైదానంలో సేవ్‌వాటర్ అక్షరాల ఆకారంలో కూర్చుని ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అన్నపూర్ణ, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ టి.హరీష్, అధ్యాపకులు హరిత, రమ్య, జ్యోత్స్న, చిన్న, లక్ష్మణ్, ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ఓరియంటల్ హైస్కూల్ 1999–2000 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆ పాఠశాల అభివృద్ధి కోసం రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయులు భాస్కర్‌శర్మ, హెచ్‌ఎం మురళిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పరికరాల పంపిణీ



భిక్కనూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన 30 మంది విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే అలింకో సంస్థ ద్వారా వచ్చిన పరికరాలను ఏడుగురు పిల్లలకు అందించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి శివప్రసాద్, ఎంపీడీవో కిరణ్‌కుమార్, మండల విద్యాధికారి రాజగంగారెడ్డి, ఐఈఆర్‌పీ మహేందర్, స్పెషల్ ఎడ్యుకేటర్ శ్యామ్‌రాజ్, హెచ్‌ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పద్మావతి, బబిత, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం చెల్లించాలి



కామారెడ్డి రూరల్: రాష్ట్రంలోని బీడీ కార్మికులకు ఏప్రిల్ నుంచి పెరిగిన కరువు భత్యం(వీడీఏ) వెంటనే అమలు చేసి చెల్లించాలని తెలంగాణ నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. శనివారం కామారెడ్డి పట్టణంలోని పెద్దబజార్‌లో గల బీడి కార్ఖానాలో బీడి కార్మికులకు పెరిగిన కరువు భత్యంపై కార్మికులతో మాట్లాడారు. కార్యక్రమంలో బాలమణి, సుగుణ, స్వప్న, లక్ష్మీ, దేవవ్వ, కళావతి, లక్ష్మీనర్సవ్వ, శాంతవ్వ, బుచ్చవ్వ, చంద్రకళ, బీడి కార్మికులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



భిక్కనూరు : మండలకేంద్రంలో కౌసల్యదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్వేరోస్ ఫౌండర్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెద్దబచ్చగారి జ్ఞానప్రకాశ్‌రెడ్డి, నాయకులు గంగళ్ల రవీందర్, కర్రోళ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.